నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 4 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

నిడమనూరు, మార్చి 3 : మండల కేంద్రంలో రూ.5.50 కోట్లతో నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులను సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను సకాలంలో పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రెండు వారాల్లోగా పనులు పూర్తి చేసి అప్పగిస్తామని కాంట్రాక్టర్ జలంధర్‌రెడ్డి ఆయనకు వివరించారు. జడ్జి వెంట జూనియర్ సివిల్ జడ్జి స్వప్న, ఏజీపీ ఉన్నం చిన్నవీరయ్య, న్యాయవాదులు, ఏఎస్ఐ జోజి ఉన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం

13,969 ఓట్లతో విజేతగా నిలిచిన పింగిళి

- తొలి ప్రాధాన్యతలో 1,215 ఓట్లతో ముందంజ
- రెండో స్థానంలో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి
- చెల్లని ఓట్లు 494.. రెండో ఓటు వేయని 9,672 మంది
- 14 గంటలపాటు సాగిన కౌంటింగ్
- శ్రీపాల్‌రెడ్డికి గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేసిన ఆర్ఓ ఇలా త్రిపాఠీ

నల్లగొండ ప్రతినిధి, మార్చి3(నమస్తే తెలంగాణ) : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం కైవసం చేసుకున్నారు. గెలుపు కోటా 11,821 ఓట్లు కాగా, అంతకుమించి 2,148 ఓట్లు సాధించారు. మొదటి నుంచి స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శిస్తూ తొలి ప్రాధాన్యత ఓట్లు రాబట్టడంతో శ్రీపాల్‌రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. తొలి ప్రాధాన్యతలోనే 1,214 ఓట్ల ఆధిక్యం ప్రదర్శించారు. ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ ప్రత్యర్థులకు అందకుండా దూకుడును కొనసాగించారు. మొత్తం 19 మంది అభ్యర్థుల్లో 18 మంది ఎలిమినేషన్ వరకు మెజార్టీ ఓట్లను సాధిస్తూ వచ్చారు. ఎలిమినేషన్ రౌండ్స్ పూర్తయ్యే సరికి అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిగా శ్రీపాల్‌రెడ్డి విజేతగా నిలిచారు. రెండో స్థానం కోసం యూటీఎఫ్ బలపర్చిన సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న పీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి మధ్య నువ్వా.. నేనా అన్నట్లు చివరి వరకు పోటీ కొనసాగింది. ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్ ప్రక్రియ పది గంటల వరకు సుదీర్ఘంగా సాగింది.

గెలుపు కోటా 11,821.. శ్రీపాల్‌రెడ్డికి అంతకుమించి 2,148 ఓట్లు

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్ఓ ఇలా త్రిపాఠి

నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఐటీ హబ్ వెనుక ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో ఉదయం 8 గంటల నుంచి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. ముందుగా స్ట్రాంగ్ రూములను ఓపెన్ చేసి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తరలించారు. ఒక్కో టేబుల్‌కు 8 బాక్సుల చొప్పున మొత్తం 25 టేబుళ్లపై 8 రౌండ్లలో 25 చొప్పున కట్టలు కట్టారు. ఉదయం 11 గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఒక్కో టేబుల్‌కు వెయ్యి బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేశారు. దాంతో వెంటనే అభ్యర్థుల వారీగా తొలి ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, వారికి పోలైన ఓట్లను వారికి కేటాయించిన బాక్సులో వేశారు. చెల్లని ఓట్లను కూడా ఇదే సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల అనుమతితో ప్రత్యేక బాక్సులో వేశారు. ఈ ప్రక్రియ సుమారు నాలుగు గంటల పాటు సాగింది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు వివరాలను అభ్యర్థుల వారీగా రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠీ ప్రకటించారు.

తొలి ప్రాధాన్యతలో శ్రీపాల్‌రెడ్డికి 1,215 ఓట్ల ఆధిక్యం

తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసే సరికి పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. 1,215 ఓట్ల ఆధిక్యతతో ముందంజలో నిలిచారు. మొత్తం 24,135 తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 494 ఓట్లు చెల్లనివిగా తేల్చారు. మిగిలిన ఓట్లల్లో వరుసగా శ్రీపాల్‌రెడ్డికి 6,035 ఓట్లు, యూటీఎఫ్ నర్సిరెడ్డికి 4820 ఓట్లు, హర్షవర్ధన్ రెడ్డికి 4,437 ఓట్లు, పూల రవీందర్‌కు 3,115 ఓట్లు, సర్వోత్తంరెడ్డికి 2,289 ఓట్లు, సుందర్‌రాజుకు 2,040 ఓట్లు వచ్చాయి. కొలిపాక వెంకటస్వామికి 421 ఓట్లు రాగా మిగతా వారికి డబుల్ డిజిట్ దాటలేదు. అతి తక్కువగా చిలుక చంద్రశేఖర్‌కు ఒక్క ఓటూ పోల్ కాలేదు.

గెలుపు కోటాగా 11,821 ఓట్లు

తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిశాక చెల్లని ఓట్లను పక్కన పెట్టి చెల్లిన ఓట్ల నుంచి గెలుపు కోటాను ఖరారు చేశారు. మొత్తం చెల్లిన ఓట్లు 23,641 ఓట్లు కాగా, అందులో 50 శాతం ప్లస్ ఒకటి కలిపి గెలుపు కోటాను 11,821 ఓట్లుగా నిర్ధారించారు. కాగా, ఏ అభ్యర్థి కూడా తొలి ప్రాధాన్యత ఓట్లల్లో గెలుపు కోటాకు దరిదాపుల్లోకి రాలేదు. అత్యధిక ఓట్లు సాధించిన శ్రీపాల్‌రెడ్డి సైతం 5,786 ఓట్ల దూరంలో నిలిచారు. దాంతో ఎలిమినేషన్ రౌండ్స్‌లో అతి తక్కువ తొలి ప్రాధాన్యత ఓట్లను సాధించిన అభ్యర్థులను కింద నుంచి పైకి ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఇది సాయంత్రం 4 గంటల నుంచి మొదలైంది.

ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యం

మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వారిలో 17 మంది ఎలిమినేషన్ రౌండ్ల వారీగా కొనసాగింది. డబుల్ డిజిట్ ఓట్లు సాధించిన అభ్యర్థులతోపాటు ట్రిపుల్ డిజిట్ సాధించిన ఒక్క అభ్యర్థి సైతం 13 రౌండ్లలో ఎలిమినేట్ అయ్యారు. సాయంత్రం 6 గంటల వరకు వీరి ఎలిమినేషన్ ముగిసింది. అప్పటికే అదనంగా శ్రీపాల్‌రెడ్డికి 130 ఓట్లు, నర్సిరెడ్డికి 126, హర్షవర్ధన్‌రెడ్డికి 159, పూల రవీందర్‌కు 130, సర్వోత్తంరెడ్డికి 105, సుందర్‌రాజుకు 101 ఓట్లు మాత్రమే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు పోల్ అయ్యాయి. సుందర్‌రాజు(2,141ఓట్లు) ఎలిమినేషన్ రౌండ్‌లో మాత్రం అత్యధికంగా శ్రీపాల్‌రెడ్డికి 751 ఓట్లు, తర్వాత పూల రవీందర్‌కు 368, నర్సిరెడ్డికి 259, సర్వోత్తంరెడ్డికి 251, హర్షవర్ధన్‌రెడ్డికి 203 ఓట్లు పోల్ అయ్యాయి. తర్వాత బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డి(2,645ఓట్లు)ని కూడా ఎలిమినేట్ చేస్తూ ఆయనకు వచ్చిన ఓట్లలో పోలైన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మిగతా అభ్యర్థులకు పంచారు. ఇందులోనూ శ్రీపాల్‌రెడ్డికి అత్యధికంగా 757 ఓట్లు, తర్వాత హర్షవర్ధన్ రెడ్డికి 510, నర్సిరెడ్డికి 455, పూల రవీందర్‌కు 375 ఓట్లు జత కలిశాయి. అయినప్పటికీ ఎవరూ గెలుపు కోటాకు దరిదాపుల్లోకి రాలేకపోయారు.

పూల రవీందర్ ఎలిమినేషన్‌లో భారీగా ఓట్లు

మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్(3,992ఓట్లు) ఎలిమినేషన్ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి అత్యధికంగా 1,348 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి 788 ఓట్లు, హర్షవర్ధన్‌రెడ్డికి 725 ఓట్లు కలిసి వచ్చాయి. ఆ రౌండ్ ముగిసే సరికి మొత్తంగా శ్రీపాల్‌రెడ్డికి 9,021 ఓట్లు, నర్సిరెడ్డికి 6,448 ఓట్లు, హర్షవర్ధన్‌రెడ్డికి 6,034 ఓట్లు వచ్చాయి. దాంతో హర్షవర్ధన్‌రెడ్డి ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ రౌండ్‌లో శ్రీపాల్ రెడ్డికి 2,078 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 2,000 ఓట్లు పోల్ అయ్యాయి. ఇక్కడే శ్రీపాల్ రెడ్డి గెలుపు కోటాకు మరో 722 ఓట్ల దూరంలో నిలిచారు. దాంతో రెండో స్థానంలో ఉన్న నర్సిరెడ్డిని కూడా ఎలిమినేట్ చేస్తూ లెక్కింపు కొనసాగించారు. ఇక్కడ శ్రీపాల్‌రెడ్డి గెలుపు కోటాను అధిగమించి ముందుకువెళ్లారు. ఈ రౌండ్ లో శ్రీపాల్ రెడ్డి 2,870 ఓట్లు సాధించి విజయం ఖరారు చేసుకున్నారు. మొత్తంగా పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి మొత్తం 13,969 ఓట్లు సాధించారు. గెలుపు కోటా 11,821 ఓట్లు కాగా, అంతకుమించి 2,148 ఓట్లతో భారీ విజయం సాధించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలుపును ధ్రువీకరిస్తూ రిటర్నింగ్ ఆఫీసర్ ఇలా త్రిపాఠీ ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

టీచర్ల ఓట్లలోనూ చెల్లనివి 494

సమాజానికి మార్గనిర్దేశం చేసే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చెల్లని ఓట్లు ఉండడం గమనార్హం. మొత్తం 494 ఓట్లు చెల్లని ఓట్లుగా అధికారులు నిర్ధారించారు. ఇవి మొత్తం ఓట్లల్లో 2.04 శాతం కావడం ఆందోళన కలిగిస్తున్నది. 2019లో జరిగిన ఎన్నికల్లోనూ 18,884 ఓట్లు పోలైతే అందు లో 858 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయ్యాయి. ఈసారి చెల్లని ఓట్ల శాతం కొంత మేర తగ్గినా ఈ మాత్రం కూడా ఉండడం విమర్శలకు తావిస్తున్నది. కొంతమంది అంకెలు కాకుండా టిక్ గుర్తు పెట్టడం, కొందరు తొలి ప్రాధాన్యత ఓటు ఇవ్వకుండా తర్వాత ప్రాధాన్యతలు ఇవ్వడం, ఇంకొందరు ఇద్దరు అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం వంటి తప్పిదాలు చేశారని కౌంటింగ్ ఏజెంట్ల ద్వారా తెలిసింది. మరోవైపు ఈ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓటు వేయని వారూ సైతం పెద్దసంఖ్యలో ఉన్నారు. ఎలిమినేషన్ రౌండ్స్ లో లెక్కింపు పూర్తయ్యే సరికి మొత్తం 9,672 మంది బ్యాలెట్ లో కేవలం తొలి ప్రాధాన్యత ఓట్లు మాత్రమే వేసి తర్వాత ఎవరికీ వేరే ప్రాధాన్యత ఓట్లు ఇవ్వలేదు.

పీఆర్‌టీయూ శ్రేణుల సంబురాలు

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డి ఘన విజయంతో ఆ సంఘం నేతలు, సభ్యులు సంబురాలు చేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి శ్రీపాల్‌రెడ్డి ట్రెండ్ కొనసాగుతుండడంతో సాయంత్రానికి నల్లగొండ జిల్లా కేంద్రానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల కీలక నేతలు అంతా తరలివచ్చారు. సాయంత్రం నుంచి వేచి చూస్తున్న క్రమంలో రాత్రి 9 గంటల తర్వాత దాదాపు విజయం ఖరారు అవడంతో పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కౌంటింగ్ అనంతరం శ్రీపాల్‌రెడ్డి బయటకు వస్తుంటే విజయోత్సవ ర్యాలీలా ముందుకు సాగారు. కౌంటింగ్ సెంటర్‌లోనే శ్రీపాల్‌రెడ్డి విజయ సంకేతం చూపుతూ తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని ప్రకటించారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమంగా ఉపాధ్యాయులు గెలిచారు

- పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

గెలుపు సింబల్ చూపిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 3 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమంగా ఉపాధ్యాయులు గెలిచారని పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి శ్రీపాల్ రెడ్డి అన్నారు. కౌంటింగ్ అనంతరం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఈ రోజు ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు అత్యంత విలువైనదని, వారి ఆత్మగౌరవమే వారిని విజయం దిశగా నడిపించిందని అన్నారు. రానున్న రోజుల్లో పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పటిష్టంగా అభివృద్ధి పరిచే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అవసరమైన పలు సూచనలు చేసి విద్యా రంగం బలోపేతానికి పని చేస్తానని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థికి ప్రభుత్వ విద్య ఉచితంగా అందుబాటులో ఉండేలా, ఉన్నత విద్యలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ విజయం ముందుగానే ఊహించినట్లు శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఓడినప్పటికీ విద్య ప్రైవేటీకరణ కాకుండా పోరాటం

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ, మార్చి 3 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న తనను రెండోసారి ఉపాధ్యాయులు వద్దనుకున్నారు కాబట్టే ఓడానని, అయినప్పటికీ విద్య ప్రైవేటీకరణ కాకుండా పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. హర్షవర్ధన్‌రెడ్డి ఎలిమినేషన్ తర్వాత నర్సిరెడ్డి కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వచ్చారు. మీడియాతో మాట్లాడుతూ ఓటమి అనేది సహజమని, గతంలో తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన ఉపాధ్యాయులు ఇప్పుడు శ్రీపాల్‌రెడ్డికి ఇచ్చారని తెలిపారు. మూడు ఉమ్మడి జిల్లాలవ్యాప్తంగా తనకు ఓట్లు వేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. వాస్తవానికి ఉదయం వరకూ తానే గెలుస్తానని నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఓటర్ల తీర్పును స్వాగతిస్తున్నట్లు చెప్తూ ఆయన రానున్న రోజుల్లో విద్య, వైద్యం వ్యాపారీకరణ కావద్దనే డిమాండ్‌తో పోరాటం చేస్తానన్నారు.

యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింస్వామికి శేషవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శేష వాహనంపై లక్ష్మీనరసింహుడు

యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, మార్చి3 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం అలంకార సేవలో భాగంగా స్వామివారు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం శేష వాహనంపై తిరు మాఢ వీధుల్లో విహరించారు. ఉదయం నిత్యపూజ కైంకర్యాల అనంతరం యజ్ఞాచార్యులు, పారాయణదారులు, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు స్వామివారికి మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలు నిర్వహించారు. అనంతరం అభిషేకోత్సవం జరిపారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకారంలోని కల్యాణ మండపంలో స్వామి వారిని మత్స్యావతారంలో అలంకరించి పశ్చిమ రాజగోపురం గుండా ఉత్తరం, తూర్పు, దక్షిణ మాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం అలంకార సేవలు, మత్స్యావతార విశిష్టతను ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీ నరసింహాచార్యులు భక్తులకు వివరించారు. సాయంత్రం నిత్యహోమం, చతుస్థానర్చనలు నిర్వహించిన అనంతరం లక్ష్మీనారసింహుడు శేషవాహన సేవలు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, యాజ్ఞికులు, పారాయణదారులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి హంస వాహనంపై స్వామి వారి సేవ నిర్వహించనున్నారు.

సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు తదితరులు

రాజీపడే అన్ని కేసులను పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, మార్చి 3 : రాజీపడదగు అన్ని కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. ఈ నెల 8న జిల్లాలోని కోర్టుల్లో నిర్వహించే లోక్ అదాలత్‌పై సోమవారం భువనగిరి కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడే అవకాశాలున్న అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ చలానా, చెక్ బౌన్స్, ఎక్సైజ్ కేసులను పరిష్కరించే విధంగా చూడాలని, సంబంధిత కక్షిదారులకు నోటీసులు త్వరితగతిన ఇవ్వాలని అన్నారు. ఇప్పటికే ప్రి లోక్ అదాలత్‌ను భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదాద్రి కోర్టుల్లో నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుని చిన్న నేరాలకు సంబంధించిన కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించాలని తెలిపారు.

దీంతో సమాజంలో శాంతి, స్నేహ పూర్వక సంబంధాలను నెలకొల్పవచ్చని చెప్పారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత, భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌సుందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఏపీపీఓలు సౌజన్య, చంద్రశేఖర్, అవినాశ్, పద్మావతి, కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఈ నెల 20 వరకు ఎగ్జామ్స్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 113 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 52,222 మంది విద్యార్థులు

రామగిరి, మార్చి 3 : ఇంటర్మీయట్ వార్షిక పరీక్షల నిర్వహణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 5 నుంచి 20వరకు పరీక్షలు జరుగనుండగా 113 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 52,222 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఇందులో ప్రథమ సంవత్సరంలో 28,884 మంది, ద్వితీయ సంవత్సరంలో 29,338 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్లను నియమించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగనుండగా గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు.

వేసవి నేపథ్యంలో ప్రత్యేక వసతులు

వేసవి దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు అన్ని వసతులు కల్పిస్తున్నారు. తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారు. ఎవరైనా అస్వస్థత చెందితే వెంటనే ప్రథమ చికిత్స అందించేలా వైద్య సిబ్బందిని కేటాయించారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులకు అందుబాటులో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

సమస్యలకు హెల్ప్‌లైన్ నంబర్

ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం చేశాం. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఎండ తీవ్రత పెరుగుతున్నందున విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచుతున్నాం. ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. నల్లగొండ జిల్లాలో పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే 7730866967 హెల్ప్‌లైన్ నంబర్‌కు చేయాలి.

-దస్రూ, డీఐఈఓ, నల్లగొండ

జిల్లా	పరీక్ష కేంద్రాలు	ప్రథమ సంవత్సరం	ద్వితీయ సంవత్సరం	మొత్తం
నల్లగొండ	52	13,992	14,730	28,722
సూర్యాపేట	32	8,640	8,308	16,948
యాదాద్రి	29	6,252	6,300	6,852
మొత్తం	113	28,884	29,338	52,222

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సూర్యాపేట టౌన్, మార్చి 3 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో రైతు, కార్మిక, వ్యవసాయ వర్గాలకు నిధుల కేటాయింపుల్లో మొండిచేయి చూపిందన్నారు. రైల్వే కోచ్‌లకు నిధులు కేటాయించలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోలేదని చెప్పారు. ఉపాధి హామీకి రూ.86వేల కోట్లు మాత్రమే కేటాయించారని, నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపారని అన్నారు. తక్షణమే బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌ను పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు అనుగుణంగా కేటాయించాలని అన్నారు. ఎస్ఎల్‌బీసీ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చి వారు ఇలా ప్రమాదాలకు గురికావడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనపై నిపుణులతో న్యాయ విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు, ముల్కలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, గోపి, ఏకలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి.. సమస్యలు తెలుసుకొని..

- ఇస్కిళ్ల గ్రామంలో కలెక్టర్ పర్యటన
- పారిశుధ్యం, నర్సరీ నిర్వహణ అస్తవ్యస్తంపై ఆగ్రహం

ఇస్కిళ్ల గ్రామంలో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట, మార్చి3 : మండలంలోని ఇస్కిళ్ల గ్రామంలో కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఉదయం అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సందర్శనలో భాగంగా మండల స్థాయి అధికారులందరూ వచ్చారా లేదా అని ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి గ్రామంలోని వీధుల్లో తిరిగారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నిగంటలు నీళ్లు వస్తున్నాయి, రేషన్ బియ్యం అందుతున్నాయా, కరెంటు సబ్సిడీ, గ్యాస్ సబ్సిడీ అందుతుందా, పారిశుధ్యం ఎలా ఉంది, పెన్షన్ వస్తుందా అంటూ అడిగారు. కొన్ని సమస్యలను అక్కడి నుంచే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో ఎన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని సంబంధిత ఏఈని అడిగారు. గ్రామానికి పీహెచ్‌సీ ఎంత దూరంలో ఉందని, ఎంతమంది బాలింతలు గ్రామంలో ఉన్నారని ఏఎన్ఎంతో సమాచారం స్వీకరించారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి ఎంత మంది విద్య అభ్యసిస్తున్నారని వసతులను పరిశీలించారు. పాఠశాల 7వ తరగతి వరకే ఉందని, 8వ తరగతి వరకు పెంచాలని గ్రామస్తులు కోరగా వెంటనే ఎంఈఓకు 8వ తరగతికి సంబంధించిన ప్రపోజల్స్ పంపించాలని ఆదేశించారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేక పోవడంతో ఆడపిల్లలు పాఠశాల మానేసి ఇంటివద్ద ఉంటున్నారని తెలుపడంతో ఆర్టీసీ డీఎంతో మాట్లాడి వెంటనే ఉదయం సాయంత్రం వేళల్లో బస్సు నడిపేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో పశు వైద్య క్యాంపును ఏర్పాటు చేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి సూచించారు. గ్రామంలో అంగన్ వాడీ సెంటర్‌ను పరిశీలించి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ఎస్టిమేట్ వేసి పంపాలని పీఆర్ఏఈని ఆదేశించారు. గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓకు ఆదేశించారు. గ్రామ నర్స